కథాకేళి

# ఇదే, నా న్యాయం

మల్లాది వెంకటకృష్ణమూర్తి



అర్చన పుట్టినరోజు సందర్భంగా జరుగుతున్న ఆ పార్టీకి పిలిచిన వాళ్లంతా వచ్చారు. అందుకు ప్రధాన కారణం అర్చన తన అభిమాన రచయితని పిలవడం, ఆ ఆహ్వానాన్ని మన్నించి కోషిక్ వస్తానని మాట ఇవ్వడం.

కోషిక్ ఆంధ్రుల అభిమాన రచయిత. ముప్ఫైవ ఏడు రాకుండానే ఏభై పైనే నవలలు రాశాడు. అన్ని నవలలు, ఏదీ ఫెయిల్ కాకుండా, పాఠకులకి నచ్చాయి. దాదాపు అన్నీ సినిమాలుగా తీయబడ్డాయి. అతని సీరియల్ నవల వుంటే చాలు, పాతికవేల కాపీలు అదనంగా అమ్ముడవుతాయి. కోషిక్‌కి అంతమంది అభిమానులున్నారన్నది ఎడిటర్స్ అందరికీ తెలిసిన సత్యం కాబట్టే అతని నవలలు కావాలంటారు.

ఇతివృత్తంలో వైరైటీ, పాత్రల్లో మేధస్సు, శైలిలో చదివించే గుణం మొదలయిన అనేక కారణాల వల్ల అతను ఏ-ఒన్ రైటర్‌గా నిలదొక్కుకోగలిగాడు. అతని అభిమానులలో అధికశాతం ఆడవాళ్ళే. టీనేజ్ యువతీ యువకులకి అతని నవలంటే పంచప్రాణాలు.

అలాంటి కోషిక్ అర్చన బర్త్‌డే పార్టీకి వస్తున్నాడని తెలిసి, ఆమె క్లాస్‌మేట్స్ అంతా సాయంత్రం ఆరున్నరకి ఆమె ఇంటికి చేరుకున్నారు. కోషిక్ కారు అర్చన ఇంటి కాంపౌండులో రాత్రి ఏడు ఇరవై అయిదుకి ఆగింది.

చాక్‌లెట్ కలర్ సూట్‌లో వున్న, ఆజానుబాహుడైన కోషిక్ కారు దిగగానే అందరి కళ్ళు అతని వైపు తిరిగాయి.

'కోషిక్ వచ్చారు', అన్న గుసగుసలు మొదలయ్యాయి.

అతను హుందాగా కారు తాళం చెవులని కోటు జేబులో వేసుకుని తన వంక చూస్తున్న వారి వంక చెయ్యి వూపి హాల్లోకి ప్రవేశించాడు.

అర్చన అరమోడ్పు కళ్లతో అతన్ని రిసీవ్ చేసుకుంది.

''మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ది డే'' మేన్‌లీ వాయిస్‌తో చెప్పి కోషిక్ తనతో తెచ్చిన కవరు అందించాడు.

''థాంక్స్'' చెప్పి అర్చన ఆత్రంతో అక్కడికక్కడే గిఫ్ట్ రేప్‌చేయబడ్డ ఆ పేకెట్‌ని విప్పతీసింది. అందులోంచి ఓ ఫైల్‌ని తీసి తెరచి చూసింది.

అర్చన మొహం ఆనందంతో వెలిగి పోయింది. అతను రాస్తున్న సీరియల్ ఆఖరి అయిదు భాగాల కార్బన్ కాపీ అది. సస్పెన్స్‌తో నడుస్తున్న ఆ సీరియల్ ముగింపు గురించి అనేకమంది అనేక ఊహాగానాలు చేస్తున్నారు.

''థాంక్స్ ఎ లాట్'' కృతజ్ఞతగా చెప్పింది అర్చన.

అభిమానులు అతని చుట్టూ మూగి తమతో తెచ్చుకున్న అతని నవలల మీద తమ పేరుతో, ఆటోగ్రాఫ్స్ తీసుకున్నారు. చిరునవ్వుతో వాళ్ల ప్రశ్నలకి సమాధానాలిస్తూ కోషిక్ ఓపికగా ఆటోగ్రాఫ్ చేశాడు.

పది నిముషాలు గడిచాయి.

''ఎక్స్‌క్యూజ్ మి. ఓసారి పక్కకి వస్తారా'' అడిగిందో అందమైన అమ్మాయి కోషిక్‌ని.

ఇద్దరూ ఆ విశాలమైన హాల్‌లో ఓ మూలకి వెళ్లారు.

''మీకు రచయితనే గర్వం చాలా వున్నట్లుందే. అది వదల గొట్టమంటారా?'' అడిగింది కసిగా. వెంటనే చాచి కోషిక్ చెంప మీద బలంగా కొట్టి, కీచుగా అరిచింది.

''ఇడియెట్. ఎంత ధైర్యం?'' క్షణాల్లో హాలు నిండా నిశ్శబ్దం వ్యాపించింది. అందరూ వాళ్ల వైపు చూశారు.

''నన్ను ముద్దడగటానికి నీకెన్ని గుండెలు'' అరిచింది ఏడుపు, కోపం కలబోసిన కంఠంతో.

ఎదురు చూడని ఆ సంఘటనకి కోషిక్ నిర్ఘాంతపోయాడు. కొన్ని జతల కళ్లు అతని వంక అసహ్యంగా చూడసాగాయి.

''ఇప్పుడేమైంది నీ గొప్ప?''

గొంతు తగ్గించి వెటకారంగా, అతనికి మాత్రమే వినపడేలా అడిగింది ఆ అమ్మాయి.

అర్చన వచ్చి ఆ అమ్మాయిని పక్కకి తీసుకెళ్లింది. కోషిక్ బుర్ర వేగంగా పని చేసింది. తనున్న పరిస్థితి గ్రహించాడు. మామూలు వాళ్లయితే ఆ అవమానానికి బయటికి వెళ్లిపోయేవారే.

కాని కోషిక్ తెలివయిన రచయిత. ఏం జరగనట్టే ప్రవర్తించి అందరితో కలిసిపోయాడు. అయిదు నిముషాలు కానిచ్చి కోషిక్ ఆ అమ్మాయి దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

''ఎక్స్‌క్యూజ్ మి ఓ సారి ప్రక్కకి వస్తారా?''

తటపటాయించకుండా అతన్ని అనుసరించింది ఆ అమ్మాయి.

''మీకు నా మీద ఎందుకింత అకారణ ద్వేషమో అర్థం చేసుకోగలను. కొందరికి ఇతరుల ఖ్యాతిని భరించే శక్తి వుండదు'' చెప్పాడు.

తర్వాత గట్టిగా అరిచాడు.

''ఎంత?''

అందరి కళ్ళూ మళ్లీ అటు వైపు తిరిగాయి. ఈ సారి మరింత ఆసక్తిగా ఆ ఇద్దరినీ చూశారు.

''గంటకి వెయ్యా? మీ శరీరం అంత విలువ చెయ్యదు.''

నిశ్శబ్దంగా వున్న ఆ హాల్‌లో, ఆ అమ్మాయితో కోషిక్ అన్న మాటలు అందరికీ స్పష్టంగా వినిపించాయి.

''ఇదే, నా న్యాయం'' గొంతు తగ్గించి ఆమెకి మాత్రం వినిపించేలా చిన్నగా చెప్పాడు ఆంధ్రుల అభిమాన రచయిత కోషిక్.